సాక్షి
నిజామాబాద్
శనివారం, 13, మే, 2023



చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలి

సారంగపూర్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని లేకుంటే రైతులకు అప్పగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నేతలు అన్నారు.

- IIIలో ▸



వైట్‌లైన్ స్పీడ్‌బ్రేకర్లతో హడల్

రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు హడలిపోతున్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
40.9 /24.9

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్య సేవలు అందించాలి



బోధన్‌రూరల్(బోధన్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్ బృందం సభ్యులు డాక్టర్ మితిలేష్ చాతుర్వేది, రోనిట్ బోరాలు సూచించారు. సాలూరలోని పీహెచ్‌సీని శుక్రవారం రెండోరోజు సభ్యులు సందర్శించారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీలో వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత ఉత్తమంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణులకు అందించాల్సిన సేవలు, ప్రసవాలు పెంపు వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సుదర్శనం, వైద్యురాలు సమత, కో–ఆర్డినేటర్ రాము తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల ఉద్యమానికి సన్నద్ధం కావాలి



మోర్తాడ్ : గల్ఫ్ దేశాల్లో వలస కార్మికులు పడుతున్న కష్టాలు, ఇబ్బందులు తొలగిపోవాలంటే గల్ఫ్ బోర్డు, ఎన్‌ఆర్‌ఐ పాలసీ అవసరమని, ఇందుకోసం ఉద్యమించడానికి సన్నద్ధం కావాలని బీజేపీ ఎన్‌ఆర్‌ఐ సెల్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ నరేంద్ర పన్నీరు అన్నారు. శుక్రవారం ఏర్గట్లలో గల్ఫ్ జేఏసీ నాయకులను ఆయన కలుసుకుని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ వలస కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎంతో మంది ఏటా విదేశీ మారకద్రవ్యాన్ని రాష్ట్రానికి, దేశానికి సంపాదించి పెడుతున్నా కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. జేఏసీ నాయకులు శివన్నోల్ల రాజు, గంగేశ్వర్, నాయుడు ముదిరాజ్, అంజి గంగాధర్, మారుతి, కట్ట నవీన్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీలో చేరిన జానకంపేట సర్పంచ్



ఎడపల్లి : మండలంలోని జానకంపేట సర్పంచ్ పాట్టెళ్ల సాయిలు, ఉపసర్పంచ్ వెల్మల విజయ్‌కుమార్ శుక్రవారం బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటికే పోచారం సర్పంచ్ ఇంద్రకరణ్ అధికార పార్టీని వీడి బీజేపీలో చేరగా తాజాగా జానకంపేట సర్పంచ్ కమలం గూటికి చేరారు. ఎంపీ అర్వింద్ తన క్యాంపు కార్యాలయంలో సాయిలుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ సాయిలు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచులను చిన్నచూపు చూస్తోందన్నారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వడంలో ఇబ్బంది పెడుతున్నారన్నారు. సర్పంచుల సమస్యలను ఎమ్మెల్యేల దృష్టికి, మంత్రుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా వారు స్పందించడం లేదన్నారు. నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి, ఉప్పు సురేష్, ఇంద్రకరణ్ ఉన్నారు.

వీసీకి.. నీకు తేడా ఏముంటుంది?

- రిజిస్ట్రార్ యాదగిరిని మందలించిన నవీన్ మిట్టల్
- ప్రభుత్వం, ఈసీ వద్దన్నా నియామకాలు ఎలా చేస్తారు?
- వ్యవస్థను కాపాడమని చెప్పి నియమిస్తే ఇలా మాట్లాడితే ఎలా అని మందలింపు
- విద్యావర్ధిని సస్పెన్షన్‌పై తక్షణమే ఆర్డర్ ఇవ్వాలని ఈసీ ఆదేశాలు
- హైదరాబాద్‌లో తెయూ 58వ పాలకమండలి సమావేశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అక్రమ నియామకాలకు పాల్పడిన వైస్ చాన్స్‌లర్‌కు, నీకు తేడా ఏముంటుందని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ రిజిస్ట్రార్ యాదగిరిని మందలించారు. ఇప్పటికే అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగం కారణంగా తెలంగాణ వర్సిటీ పరువు పోయిందని, దీంతో ఈసీ చర్యలకు పూనుకుందని.. ఎలాంటి నియామకాలు చేయవద్దని ప్రభుత్వం, ఈసీ చెప్పినప్పటికీ.. అవసరం ఆధారంగా నియామకాలు చేయాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ యాదగిరి అనడంపై పాలకమండలి సభ్యులు అభ్యంతరం చెప్పడంతో పాటు గట్టిగా ప్రశ్నించడంతో నవీన్ మిట్టల్ ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రూసా భవనంలో టీయూ 58వ పాలకమండలి సమావేశం జరిగింది. వీసీ రవీందర్ గుప్తా హాజరు కాకపోవడంతో నవీన్ మిట్టల్ సమావేశానికి చైర్మన్‌గా వ్యవహరించారు. రిజిస్ట్రార్ వ్యవస్థను కాపాడాల్సిందేనన్నారు. వీసీ చేసిన విధంగానే నియామకాలు చేస్తానంటే ఎలా అని మిట్టల్ మందలించారు. ఇదిలా ఉండగా అంతర్గత ప్రమోషన్లు పొందిన వారు యాదగిరిని కలిసిన నేపథ్యంలో.. వాళ్లకు తమను కలవాలని ఎలా సలహా ఇస్తారని పాలకమండలి సభ్యులు నిలదీశారు. ప్రభుత్వం పదోన్నతులు ఇవ్వొద్దని నిర్ణయిస్తే తమను కలవమని ఎలా సూచించారన్నారు. నెపం తమపైకి నెట్టే ప్రయత్నం చేస్తే ఎలా అని ఈసీ సభ్యులు ప్రశ్నించారు. సమావేశంలో పలు తీర్మానాలను చేశారు.

ఈసీకి పంపిన తర్వాతే..

గత నెల 26న, ఈ నెల 5న నిర్వహించిన సమావేశాల్లో చేసిన తీర్మానాలను తక్షణమే అమలు చేయాలని రిజిస్ట్రార్ యాదగిరిని ఈసీ ఆదేశించింది. బడ్జెట్ ఆమోదం కానుందున ప్రస్తుత రిజిస్ట్రార్ జీతాలతో సహా చేసే ప్రతి ఖర్చు వివరాన్ని ప్రతి వారం ఈసీకి పంపి ఆమోదించాకే చేయాలని నిర్ణయించారు. వీసీ చేసిన నియామకాలను రద్దు చేయడంతో పాటు, విద్యావర్ధిని చేసిన జీతాల చెల్లింపునకు సంబంధించి రికవరీ చేయాలని నిర్ణయించారు. లేకపోతే క్రిమినల్ కేసులు పెట్టాలని తీర్మానించారు. విద్యావర్ధిని, శివశంకర్ చేసిన నిధుల దుర్వినియోగం వివరాలను తదుపరి ఈ నెల 25న నిర్వహించే ఈసీ సమావేశంలో అందించాలని నిర్ణయించారు.

పీహెచ్‌డీ కుంభకోణంపై విచారణకు త్రిసభ్య కమిటీ

విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కుంభకోణంపై విచారణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఈసీ సభ్యులు వసుంధరాదేవి, గంగాధర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. తెలుగు విభాగం స్కాలర్ పుప్పాల రవీందర్‌కు ఇచ్చిన పీహెచ్‌డీ అవార్డుపై విచారించేందుకు నిర్ణయించారు. అదేవిధంగా ఆర్ట్స్ విభాగం డీన్ కనకయ్య ఇచ్చిన సూపర్ న్యూమరరీ కోటా పీహెచ్‌డీ అడ్మిషన్లపైనా విచారణకు తీర్మానం చేశారు. పీహెచ్‌డీ స్కాంపై నిజామాబాద్ జిల్లా విద్యార్థి, యువజన, విద్యావంతుల, మేధావుల ఐక్య కార్యాచరణ సమితి పేరిట తాజాగా నవీన్ మిట్టల్‌కు ఇప్పటికే ఫిర్యాదు అందింది.

కేసు నమోదుకు..

ఈ నెల 15న విద్యావర్ధిని సస్పెన్షన్‌కు ఆర్డర్ జారీ చేయాలని రిజిస్ట్రార్ యాదగిరిని ఆదేశించారు. అదేవిధంగా అకడమిక్ కన్సల్టెంట్ శ్రీనివాస్‌ను రిమూవ్ చేసే ఆర్డర్ సైతం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. కనకయ్య నలుగురు ప్రొఫెసర్ల సర్వీసు పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి జిరాక్స్ కాపీలను తీసి బయట పంచిపెట్టిన విషయమై సైతం కేసు నమోదుకు నిర్ణయించారు. సమావేశంలో ఈసీ సభ్యులు వసుంధరాదేవి, గంగాధర్‌గౌడ్, మారయ్యగౌడ్, ఎస్ఎల్ శాస్త్రి, ప్రవీణ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, ఆరతి, నసీమ్, చంద్రకళ పాల్గొన్నారు.

పంటల ప్రణాళిక ఖరారు..



- ఖరీఫ్ ప్రతిపాదనలను రూపొందించిన వ్యవసాయ శాఖ
- 5,13,356 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా
- గతేడాదితో పోలిస్తే కొంతమేర పెరుగుదల

డొంకేశ్వర్(ఆర్మూర్) : వానాకాలం పంటల సాగు ప్రణాళిక ఖరారైంది. ఈ సీజన్‌లో 5,13,356 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా ప్రతిపాదనలను రూపొందించింది. అత్యధికంగా వరి 4,17,943 ఎకరాల్లో సాగు కానున్నట్లు పేర్కొంది. అయితే గతేడాది ఖరీఫ్‌లో 5,09,753 ఎకరాలు ప్రతిపాదించగా, 5,11,050 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో కూడా అంచనాలకు మించి పంటలు సాగయ్యే అవకాశాలున్నాయి. జూన్ మొదటి వారం నుంచి వరినాట్లు మొదలవ్వనున్నాయి. వరి తర్వాత సోయా, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేసేందుకు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉంది. ఖరారైన అంచనా పంటల ప్రణాళికను ఈ నెల 17న కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేయాలని వ్యవసాయ శాఖ భావిస్తోంది. అదే సమయంలో వ్యవసాయ అధికారులందరితో కలెక్టర్ సమావేశం నిర్వహించి సూచనలు చేయనున్నారని సమాచారం.

ఖరీఫ్ అంచనా ప్రణాళిక

పంట	ఎకరాలు
వరి	4,17,943
మొక్కజొన్న	32,185
సోయాబీన్	58,715
పత్తి	1,803
కంది	1,883
పెసర	151
మినుములు	125
వేరుశనగ	204
ఇతర పంటలు	347
మొత్తం	5,13,356

విత్తనాలు, ఎరువులు..

పంటలకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులకు కూడా వ్యవసాయ శాఖ ప్రణాళిక తయారు చేసింది. వరికి 1,25,382 క్వింటాళ్లు, మొక్కజొన్నకు 2,575 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కానున్నట్లు అంచనా వేసింది. అలాగే సోయాబీన్ 17,615 క్వింటాళ్లు, పెసర 12 క్వింటాళ్లు, కంది 75 క్వింటాళ్లు, మినుము 10 క్వింటాళ్లు, పత్తికి 3,606 ప్యాకెట్లు అవసరం అవుతాయని ప్రతిపాదించింది. కాగా ఎరువుల్లో యూరియా 89,836, డీఏపీ 21,619, ఎంవోపీ 6,657, కాంప్లెక్స్ 32,383 మెట్రిక్ టన్నులు అవసరం అయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

డీసీఎం బోల్తా ఘటనలో బాధితులకు మెరుగైన చికిత్స

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి

నిజామాబాద్ సిటీ/రుద్రూరు: బడాపహాడ్ దర్గాకు వెళ్తూ ప్రమాదానికి గురై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నట్లు మంత్రి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. చందూర్ శివారులో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత డీసీఎం వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాలకు చెందిన సాయిలు బడాపహాడ్‌లో మొక్కు తీర్చుకునేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి డీసీఎంలో వెళ్తుండగా చందూర్ శివారులో ప్రమాదం జరిగింది. ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలు కాగా, మరో 30 మంది స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అందుతున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మాట్లాడారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ బాల్కొండ నియోజవర్గం మానాలకు చెందిన సుమారు 50 మంది బడాపహాడ్ వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న డీసీఎం వ్యాన్ దురదృష్టవశాత్తు బోల్తాపడిందని తెలిపారు. ఘటన గురించి తెలిసిన వెంటనే ప్రభుత్వ యంత్రాగం సకాలంలో అప్రమత్తమైందన్నారు. స్థానిక పోలీసులు వెంటనే క్షతగాత్రులను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి తరలించడంతో వైద్యులు మెరుగైన చికిత్స అందించారని తెలిపారు. మంత్రి వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు నాగేశ్వరరావు, అధికారులు తదితరులు ఉన్నారు.

మూడోసారి కేసీఆర్ సీఎం అవడం ఖాయం

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



యానంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి : తెలంగాణలో ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, ప్రతిపక్ష పార్టీలకు రాజకీయ సన్యాసం తప్పదని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. యానంపల్లిలో రూ. 3.85 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని విస్మరించాయన్నారు. సీఎం కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాత ఒక్కో గ్రామానికి కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఒక్క యానంపల్లిలోనే రూ.3.56 కోట్లు మంజూరు చేశారంటే మిగిలిన గ్రామాల్లో ఎంత మంజూరు అయ్యాయో ప్రజలు గుర్తించాలన్నారు. పసుపు బోర్డు తెస్తానని గద్దెనెక్కిన ఎంపీ అర్వింద్ జిల్లాకు ఒక్క రూపాయి అయినా మంజూరు చేశారా అంటూ ప్రశ్నించారు. డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, డిచ్‌పల్లి జెడ్పీటీసీ ఇందిర లక్ష్మీనర్సయ్య, చింత శ్రీనివాస్ రెడ్డి, నారాయణరెడ్డి, సర్పంచ్ గోపు చిన్నుబాయి గంగాధర్, ఎంపీటీసీ మంజుల పాల్గొన్నారు.

సిట్టింగుల్లో సర్వే ఫీవర్!

- ఎన్నికలకు సమాయత్తమవుతున్న పార్టీలు
- ముందున్న అధికార బీఆర్‌ఎస్
- పలు విధాలుగా సర్వేలు చేయిస్తున్న గులాబీ బాస్
- మంత్రులు, ఎమ్మెల్యేల్లో టెన్షన్



సాక్షి, కామారెడ్డి : తెలంగాణ అసెంబ్లీకి ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని పార్టీలు ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నాయి. ఇప్పటి నుంచే ప్రధాన పార్టీలు సర్వేలు చేయిస్తున్నాయి. అధికార బీఆర్‌ఎస్ పార్టీ సర్వేలు చేయించడంలో ముందున్నది. నెలన్నరగా రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్వేలు చేయిస్తున్నట్లు తెలిసింది. దీంతో సిట్టింగుల్లో ఆందోళన మొదలైంది. జిల్లాలోని ప్రస్తుత ఎమ్మెల్యేల పనితీరు.. నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు.. ప్రజలనాడి తెలుసుకోవడానికి విభిన్న కోణాల్లో సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. కొన్ని రోజులుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సమ్మేళనాలు జరుగుతున్నాయి. ఈ సమ్మేళనాలు ఎలా జరుగుతున్నాయి.. ఎవరెవరు పాల్గొంటున్నారు. పాల్గొన్న నాయకులు ఏం మాట్లాడుతున్నారు.. సమ్మేళనాల్లో క్యాడర్ స్పందన ఎలా ఉంది.. అసంతృప్తులు, అసమ్మతి రాగాలు ఎలా ఉన్నాయి.. ప్రస్తుత ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.. సిట్టింగులపై క్యాడర్‌లో ఏమంటున్నది.. ఇలా అనేక అంశాలపై బీఆర్‌ఎస్ అధినేత సీక్రెట్‌గా సర్వే చేయిస్తున్నట్లు తెలిసింది. తమ పార్టీ పరిశీలకులతో పాటు పార్టీ అనుబంధ పత్రిక ఆధ్వర్యంలో, అలాగే ఐప్యాక్ సంస్థ, రాష్ట్ర నిఘా వర్గాలతో సర్వేలు చేయిస్తున్నట్లు తెలిసింది. అన్ని సర్వేలు క్రోడీకరించి రానున్న ఎన్నికల్లో సీట్లు కేటాయించే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ కోణంలోనే కాకుండా ప్రస్తుత ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఇతర రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన పనితీరుపై ఆరాతీస్తున్నట్లు సమాచారం. అంతే కాకుండా ప్రభుత్వంపై ప్రజల నాడి ఎలా ఉంది.. ఏఏ వర్గాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది..? ఏఏ వర్గాలు ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నాయి..? పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధిపై ప్రజల్లో ఎలాంటి స్పందన ఉంది.? పార్టీ కేడర్ ఏమనుకుంటున్నది.. తదితర అన్ని కోణాల్లో అధికార పార్టీ సర్వేలు కొనసాగుతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు ఏమైనా వివాదాల్లో తలదూరుస్తున్నారా అని కూడా ఆరా తీస్తున్నారు. అన్ని నియోజక వర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ వివిధ రకాలుగా సర్వేలు నిర్వహిస్తూ వస్తోంది.

మూడో కంటికి తెలియకుండా..

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేలు మూడో కంటికి తెలియకుండా జరుగుతున్నాయి. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో సర్వే ఫీవర్ పట్టుకున్నది. సర్వేలో తేడా వస్తే తమ సీట్లు గల్లంతు అవుతాయని సిట్టింగ్‌లు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్‌లో కొత్త జోష్..

కాగా, ఈసారి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో గెలిచి అధికారంలోకి రావాలని అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. దీనికోసం ఇప్పటి నుంచే ఎన్నికలకు సమాయత్తం అవుతున్నాయి. ఆయా పార్టీలు పాదయాత్రలు, పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క పాదయాత్రలు చేస్తూ క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర, తరువాత రేవంత్‌రెడ్డి నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఇటీవల రాజధాని హైదరాబాద్‌లో పార్టీ అగ్రనేత ప్రియాంకాగాంధీ చేతుల మీదుగా యూత్ డిక్లరేషన్ ప్రకటించారు. యూత్ డిక్లరేషన్‌పై మంచి స్పందన వస్తుండడంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం పెరిగింది. గతంతో పోలిస్తే కాంగ్రెస్ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగానే స్పందిస్తున్నారు. కాంగ్రెస్‌కు అన్ని ప్రాంతాల్లో ఓట్ బ్యాంక్ ఉంది. ఇది ఈసారి తమకు కలిసి వస్తుందని ఆ పార్టీ నేతలు ఆశపడుతున్నారు.

బీజేపీ దూకుడు..

ఈసారి అధికారం చేపట్టడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగడుతోంది. ప్రభుత్వంపై సమరశంకం పూరించింది. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ముందున్నారు. ఏ అంశాన్నీ వదులుకోవడం లేదు. హిందుత్వమే ఎజెండాగా బీజేపీ దూకుడుగా వ్యవహరిస్తున్నది. రైతు భరోసా యాత్ర, నిరుద్యోగ మిషన్ మార్చ్ వంటి కార్యక్రమాలు చేపడుతుంది. పార్టీ కేడర్ కూడా ఉత్సాహంగా కార్యక్రమాల్లో భాగమవుతుంది. ఉమ్మడి జిల్లాలోని కొన్ని నియోజక వర్గాల్లో బీజేపీ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలో మాస్టర్ ప్లాన్ అంశం, డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ బకాయిలపై పోరాటాలతో జనంలోకి వెళ్లింది. ఎన్నికల్లో గెలవాలన్న లక్ష్యంతో దూకుడుగా వ్యవహరిస్తోంది.

తడిసిన ధాన్యాన్ని ఇథనాల్ ఫ్యాక్టరీలకు తరలించాలి

ఎంపీ ధర్మపురి అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్ : అకాల వర్షాలతో తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని ఇథనాల్ ఫ్యాక్టరీలకు తరలించాలన్న సోయి కూడా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు లేకుండా పోయిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని 9వ డివిజన్ ఇంద్రపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు నాయకులు కిరణ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో డివిజన్ వాసులు బీజేపీలో చేరారు. వారికి ఎంపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి ఇంద్రపూర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ.. అకాల వర్షాలతో భారీగా పంట నష్టం జరిగిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇథనాల్ ఫ్యాక్టరీలకు తరలించాలని సూచించారు. రాష్ట్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయలేదని, మహారాష్ట్ర, కర్ణాటకలో ఆ ఫ్యాక్టరీలకు ధాన్యం అవసరం ఉందని పేర్కొన్నారు. సీఎం దళితులకు ఇచ్చిన హామీలన్నింటిని విస్మరించారని, ఏ పథకం కూడా సక్రమంగా అమలు కావడం లేదన్నారు. నగరంలోని నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, అయినా ఎవరికి ఇవ్వడం లేదన్నారు. దళితబంధులో కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేల జాబితాను ప్రకటించాలని వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీ అధ్వానంగా తయారైందని, రూ.3 కోట్లు లంచం ఇచ్చి వీసీ పోస్టు తెచ్చుకున్నారని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, మోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోడువారినా అందమే!

పచ్చదనంతో ఆహ్లాదం పంచే చెట్లు.. మోడువారినా ఆకట్టుకుంటున్నాయి. నీటి కొలను మాదిరిగా కనిపిస్తున్న చెరువులో ఎండిపోయిన ఈ రెండు తుమ్మ చెట్లు చిత్రాన్ని గీసినట్లుగా కనిపిస్తున్నాయి. డొంకేశ్వర్ మండలం మారంపల్లిలో ఈ చిత్రాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

క్లుప్తంగా

బాల్య వివాహంపై కౌన్సెలింగ్



సిరికొండ: మండల కేంద్రంలో ఈనెల 14న నిర్వహించనున్న బాల్య వివాహంపై బాలిక కుటుంబ సభ్యులకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బాలికకు భీంగల్ మండలం కుప్పకంటి గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేయడానికి బాలిక కుటుంబ సభ్యులు నిర్ణయించారు. 1098 ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు బాలిక ఇంటి వద్దకు వెళ్లి, కుటుంబసభ్యులకు బాల్యవివాహంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలికను సంరక్షణ నిమిత్తం సఖి కేంద్రానికి తరలించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రియదర్శిని తెలిపారు. ఐసీడీఎస్ కౌన్సిలర్ సోషల్ వర్కర్ బాబురావు, 1098 బృందం సభ్యుడు బీక్‌సింగ్, ఏఎస్సై బాల్‌సింగ్ పాల్గొన్నారు

తాటిచెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడికి గాయాలు



సిరికొండ: మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఉదయం కల్లు గీయడానికి తాటిచెట్టు పైకి ఎక్కాడు. అనంతరం అదుపుతప్పి కిందికి జారిపోతుండగా.. మోకు ఊడిపోవడంతో కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడి కాలు విరిగిపోగా, చేతులకు ముఖానికి గాయాలయ్యాయి కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు

రసవత్తరంగా కుస్తీ పోటీలు



రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. గ్రామంలో శ్రీవారి కల్యాణోత్సవం అనంతరం కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కుస్తీ పోటీలకు మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివచ్చారు. విజేతలకు వీడీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు.

కొనసాగిన విచారణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కిచ్చన్నపేట గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన స్త్రీనిధి వాయిదాల సొమ్ములో జరిగిన అవకతవకలపై రెండోరోజు శుక్రవారం సెర్ప్ అధికారులు విచారణ జరిపారు. సభ్యులందరూ అందుబాటులో లేకపోవడం వల్ల అందుబాటులో ఉన్న సభ్యులకు సంబంధించిన మహిళాసంఘాల రికార్డులను వారు పరిశీలించారు. సోమవారం విచారణ పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. డీపీఎం రవీందర్‌రావు, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎం జగదీశ్ తదితరులు ఉన్నారు.

వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్లతో హడల్!

- ఆటోలకు తరచూ మరమ్మతులు
- లబోదిబోమంటున్న వాహనదారులు



భిక్కనూరు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వైట్ లైన్ స్పీడ్ బ్రేకర్స్

భిక్కనూరు: వాహనాల వేగాలను నియంత్రించేందుకు నేషనల్ హైవే ఆథారిటీ అధికారులు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్లు వాహనదారులను హడలెత్తిస్తున్నాయి. వీటి వల్ల వాహనాలు విపరీతంగా చెడిపోయి మరమ్మతులకు గురవుతున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు. కొన్ని వాహనాలు హైవే పైనే నిలిచిపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 56..

జాతీయ రహదారిపై స్పీడ్ బేకర్లు ఉండటం వల్ల ఇంధనం వృథా అవుతుందనే ఉద్దేశంతో చాలాకాలం టుకు స్పీడ్ బ్రేకర్లను తొలగించారు. కానీ అతివేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన పోలీసులు, అధికారులు నేషనల్ హైవే అధికారులకు ఈ విషయాన్ని వివరించారు. దీంతో నేషనల్ హైవే అధికారులు జాతీయ రహదారిపై వేగాన్ని నిరోధించేందుకు చిన్నచిన్నగా వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్లను నాలుగు నెలల క్రితం ఏర్పాటు చేశారు. భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామం నుంచి కామారెడ్డి వరకు 24 కిలో మీటర్ల దూరం ఉంటుంది. హైవే అధికారులు ఈ 24 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారిపై ఒక వైపు 18 చోట్ల ఈ వైట్ కలర్ లైన్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అలాగే నిజామాబాద్ వరకు మొత్తం 56 వైట్‌లైన్స్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. వాహనాలు దీనిపై వెళ్తుండటంలో పరికరాలకు ఉండే నట్లు, బోల్టులు ఊడిపోవడం వంటివి జరుగుతున్నాయి. ముఖ్యంగా ఆటోలకు తేలికపాటి వాహనాలకు ఈ వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్లు ఇబ్బందికరంగా మారాయి. టైర్లు సస్పెన్షన్లు కమాన్‌పట్టీలు కూడా మరమ్మతులపాలు అవుతున్నాయి. దీనివల్ల వాహన యజమానులు, డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వీటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఇంజన్ నట్లు ఊడిపోయాయి



హైవేపై వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్ల వల్ల ఆటోలు తరచూ చెడిపోతున్నాయి. వచ్చే డబ్బుల కంటే మరమ్మతులకు ఎక్కువగా ఖర్చు అవుతున్నాయి. ఇటీవల వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్ల వల్ల ఆటో ఇంజిన్ నట్లు ఊడిపోయి ఇంజన్ కిందపడిపోయింది. రిపేరు చేయించుకోగా రూ.4వేలకు పైగా ఖర్చు అయ్యాయి.

–బాలకుమార్, ఆటోడ్రైవర్, భిక్కనూరు

వాహనాలు చెడిపోతున్నాయి..



జాతీయ రహదారిపై నాలుగు నెలల క్రితం వేగాన్ని నిరోధించేందుకు వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వాహనాలకు విపరీతంగా మరమ్మతులు వస్తున్నాయి. టైర్లు డెస్కులు చెడిపోతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి వైట్‌లైన్ స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి.

–బోగరి సంతోష్, కారు యజమాని, భిక్కనూరు

నర్సుల సేవలు మరువలేం



కేక్ కట్ చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: నర్సుల సేవలు మరువలేమని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నర్సులు మదర్ థెరిస్సా వారసులని, ఎలాంటి కల్మషం లేకుండా రోగులకు మీరు అందించే సేవ ఎంతో గొప్పదన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సులు, వైద్యబృందంతో కలిసి కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారిని శాలువాతో సత్కరించారు.

నిజామాబాద్‌సిటీ: నగరంలో సుభాష్‌నగర్ సరస్వతి ఎంపీహెచ్‌డబ్ల్యూ(మహిళ) ట్రెనింగ్ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నర్సులు జిల్లా నర్సింగ్ ఆఫీసర్ సులోచనను శాలువాతో సన్మానించారు. చైర్మన్ రమేష్‌గౌడ్ తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఖలీల్‌వాడి: నగరంలోని న్యూ హౌజింగ్‌బోర్డ్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండుగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా.. కాలనీకి చెందిన శ్యామల వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లింది. శుక్రవారం ఇంటికి వచ్చిన బాధితురాలు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. 5తులాల వెండి గొలుసులు, రెండు సంచుల బియ్యం, ఒక పరుపు, వంటింటి సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లినట్టు బాధితురాలు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

–పలువురికి తీవ్ర గాయాలు



పుట్టబాలయ్య (ఫైల్)

రాజంపేట: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన పుట్ట బాలయ్య(53) మేస్త్రీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మెదక్‌లో మేస్త్రీ పని ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి గురువారం ఉదయం బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి ఎల్లారెడ్డిపల్లి, కొండపూర్ గ్రామాల మధ్యగల వాగు సమీపంలో అతడి బైక్ అదుపుతప్పి కిందపడిపోయింది. ఈఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య మణెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

పశువును తప్పించబోయి అదుపుతప్పిన బైక్..

పటాన్‌చెరుటౌన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లాకు చెందిన దంపతుల్లో భర్త మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లాకు చెందిన రమేష్ బతుకుదెరువుకు నగరానికి వలసవచ్చాడు. రామంతపూర్‌లో నివాసముంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉండే బంధువుల ఇంటికి రమేష్ తన భార్య మౌనిక మూడేళ్ల కూతురు జెశ్వికతో కలిసి బైక్‌పై వచ్చాడు. రాత్రి ఇస్నాపూర్ నుంచి సిటీకి వెళుతుండగా, పటాన్‌చెరులోని జేకే ఫెన్నర్ పరిశ్రమ సమీపంలోని జాతీయరహదారిపై రాగానే పశువు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేష్(33) అక్కడికక్కడే మృతి చెందగా, భార్య మౌనికకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బీరంగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో జెశ్విక బయటపడింది. రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీలు

కూలీలను బొలెరో ఢీకొన్న ఘటనలో..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహారీ హమాలీలు తీవ్రంగా గాయపడ్డారు. బ్రాహ్మణపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాలు చేసి, ఖేతకిరైస్ మిల్లుకు వెళ్తుండగా నాందేడ్- సంగారెడ్డి జాతీయ రహదారిపై వెళ్తున్న బొలేరో వాహనం కూలీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు కూలీలు గాయపడంతో చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు.

చికిత్సపొందుతూ ఒకరు..

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు యత్నించడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. సాలూరకు చెందిన చిన్న సాయన్న(62) కొన్నేళ్లుగా కడుపు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతుండేవాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి, గ్రామ శివారులో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు అతడిని నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

పాముకాటుకు గురైన వృద్ధురాలు..



మృతి చెందిన శాంతాబాయి

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి శాంతాబాయి (65) గురువారం రాత్రి పాము కాటుకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం మృతి చెందారు. మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. గురువారం రాత్రి ఆరు బయట నిద్రించిన శాంతబాయికి పాము కాటు వేసింది. వెంటనే ఆమె కేకలు వేయటంతో కుటుంబ సభ్యులు మేల్కొని కాటు వేసిన కట్ల పామును చంపి, శాంతాబాయిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. కుమారుడు కుమ్మరి ముత్తెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

వేల్పూర్: మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన జంగిలి ముత్యం, జంగిలి సంజీవ్ అనే వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బండి రాకేశ్ అనే యువకుడిని ముత్యం, సంజీవ్‌లు కులం పేరుతో దూషించి కొట్టారని పేర్కొన్నారు. రాకేశ్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం అటవీ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మల్లారం అడవి మధ్యలో రోడ్డు పక్కన చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండగా మల్లారం వీఆర్ఏ రాజు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతి చెందిన వ్యక్తి సుమారు 45నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటాడన్నారు. ఎవరైనా మృతుడిని గుర్తు పడితే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ఆర్యనగర్‌లో చైన్‌స్నాచింగ్



ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌లో శుక్రవారం ఉదయం చైన్ స్నాచింగ్ జరిగినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆర్యనగర్ గూడెంకి చెందిన మేకల శ్రావణి హౌజింగ్‌బోర్డు కాలనీలో ట్యూషన్ చెప్పి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా.. మార్గమధ్యలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీపై ఆమె వెనకనుంచి వెంబడించి ఆమె చేతిలోని మొబైల్ ఫోన్, మెడలోని అర్ధతులం బంగారు గొలుసును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. పోలీసులు అమరవీరుల పార్కుల వద్ద ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి, నిందితులను గుర్తించారు.

భూమి గొడవ.. ప్రాణభయంతో ఊరు వదిలిన కుటుంబం



మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

రామారెడ్డి: ఓ భూమి విషయంలో గొడవ జరగడంతో ఓ వ్యక్తి నుంచి ప్రాణభయం ఉందని భయపడి ఓ కుటుంబం ఊరును వదిలివెళ్లిన ఘటన మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇసన్నపల్లి గ్రామానికి చెందిన గొర్రె నర్సింలు, తల్లి గొర్రె రాజవ్వ అదే గ్రామానికి చెందిన ఎర్ర ఆశయ్య దగ్గర రెండున్నర గుంటల భూమిని 30 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసింది. దీంతో గొర్రె నర్సింలు ఆ భూమిలో గత ఆరు సంవత్సరాల నుంచి పూరిగుడిసె వేసుకొని నివసిస్తున్నాడు. కొన్నిరోజులుగా ఎర్ర ఆశయ్య మనువడు ఎర్ర శ్రీనివాస్ భూమి తమదంటూ పలుమార్లు గొర్రె నర్సింలు కుటుంబంపై దాడి చేయడంతో పాటు, చంపేస్తానంటూ పలుసార్లు బెదిరించారు. దీంతో గొర్రె నర్సింలు తమకు ప్రాణభయం ఉందని గ్రామాన్ని వదిలి వెళ్లిపోతున్నట్లు, తమ కుటుంబానికి అధికారులు, పోలీసులు న్యాయం చేయాలంటూ వేడుకున్నాడు. భూమికి సంబంధించిన పత్రాలు ఉన్నప్పటికీ, బెదిరింపులకు పాల్పడటంపై ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గురువారం కామారెడ్డి డీఎస్పీ సురేష్‌కు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ సురేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా, ఎర్ర శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ.. గొర్రె నర్సింలు పక్కనే తన రెండున్నర గుంటల భూమి ఉందని, సర్వే చేయించి, సరిసమానంగా హద్దులను పెట్టుకుందామని తెలిపిన వినలేదని, అనవసర ఆరోపణలు చేస్తూ తనపై కేసులు నమోదు చేయిస్తున్నారని వాపోతయాడు. సర్వేయర్ వచ్చి ఇద్దరికి సమానంగా భూమిని పంచితే తనకు ఎలాంటి అభ్యతరం లేదని పేర్కొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నిధుల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వధ్యేయమని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరశివారులోని తన నివాసంలో మండలంలోని మంచిప్ప, నర్సింగ్‌పల్లి గ్రామాల్లో పలు సంఘాలకు ఎస్‌డీఎఫ్ నిధుల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈసందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శవంతమైన పథకాలు అమల్జేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. మంచిప్పలో గంగపుత్ర సంఘానికి రూ.5లక్షలు, మంచిప్ప, నర్సింగ్‌పల్లిలో మైనార్టీ కమిటీ హాళ్లకు రూ.3లక్షల చొప్పున మంజూరు పత్రాలు అందజేశారు.

ప్రాణహాని ఉందని ఫిర్యాదు

ఖలీల్ వాడి: తన వ్యాపార సహచరులతో తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని నగరంలోని ఆటోనగర్‌కు చెందిన సుజాద్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం నిజామాబాద్ ఏసీపీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. తనకు కొంతకాలంగా వ్యాపార ఆర్థిక లావాదేవీల్లో భాగంగా తమ సహచరులు అకారణంగా ఫాలో అవుతూ కిడ్నాప్ చేయడానికి ప్రయత్నిస్తూ, హత్యాయత్నానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు వారిపై చర్యలు తీసుకుని తమను కాపాడాలని ఆయన కోరారు.

బైపాస్ సర్జరీతో బతికినా.. రోడ్డు ప్రమాదంలో మృతి



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

తూప్రాన్: బైపాస్ సర్జరీ నుంచి బతికిన వ్యక్తిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ జిల్లా దూదిగాం గ్రామానికి చెందిన చాకలి పడిగెల బాపయ్య(64) గత నెల 28న సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకున్నాడు. ఈ నెల 6న డిశ్చార్జి తర్వాత స్వగ్రామానికి వెళ్లాడు. కుట్లు విప్పించుకోవడానికి స్వగ్రామం నుంచి శుక్రవారం సికింద్రాబాద్‌కు పయనమయ్యాడు. తూప్రాన్ మండలం రావెల్లి గ్రామ సమీపంలో హైవేపై వీరు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో కూర్చున్న బాపయ్యకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచారు.

చోరీకి గురైన బైక్.. డ్రంకన్‌డ్రైవ్ కేసుతో దొరికింది



యజమాని చెంతకు చేరిన వాహనం

మోర్తాడ్(బాల్కొండ): మండల కేంద్రంలో మూడేళ్ల క్రితం చోరీకి గురైన బైక్ డ్రంకన్‌డ్రైవ్ కేసుతో పట్టుబడి యజమాని చెంతకు చేరింది. పోలీసులు, బైక్ యజమాని తెలిపిన వివరాలు ఇలా.. మూడేళ్ల క్రితం కమ్మర్‌పల్లికి చెందిన నల్ల నాగభూషన్ తన ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకున్నారు. ఇటీవల నాగభూషన్ సెల్ నంబర్‌కు ఒక మెస్సెజ్ వచ్చింది. ఏపీ 25ఎస్ 6326 వాహనంపై డ్రంకన్‌డ్రైవ్ కింద కేసు నమోదైనట్లు ఎస్ఎంఎస్ వచ్చింది. ఎడపల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్ఎంఎస్ గురించి ఆరా తీయగా అప్పట్లో చోరీకి గురైన వాహనం ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్లు తేలింది. వాహనం కొనుగోలు చేసిన వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి కాగితాలను పరిశీలించడంతో నాగభూషన్ పేరుపైనే వాహనం రిజిస్ట్రేషన్ చేసి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాహనంను పోలీసులు స్వాధీనం చేసుకుని నాగభూషన్‌కు అప్పగించారు. కమ్మర్‌పల్లిలో చోరీకి గురైన వాహనం మెట్‌పల్లి ప్రాంతంలో విక్రయించబడగా ఎడపల్లి మండలానికి చెందిన వ్యక్తి కొనుగోలు చేశాడు. వాహనంను ఎవరు దొంగలించారో మాత్రం స్పష్టత కాలేదు.

అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య



కేసరి జగదీష్ (ఫైల్)

పిట్లం(జుక్కల్): అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాలు ఇలా.. నస్రుల్లాబాద్ మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన హార్వెస్టర్ యజమాని కేసరి జగదీష్(27)కు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో పిట్లం మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌పై వెళ్లిందనే పుకార్లతో బాలిక..

ఖలీల్‌వాడి: బైక్‌పై వెళ్లిందనే పుకార్లు, తల్లిదండ్రుల మందలింపు కారణంగా ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన తబుసుమ్‌ఖానం(16) ఈనెల 8న రాత్రి కిరాణాషాపుకు వెళ్లింది. అక్కడ తనకు తెలిసిన వ్యక్తి కలవడంతో అతనితో బైక్‌పై వెళ్లింది. ఈ విషయాన్ని అదే కాలనీకి చెందిన ఆమీర్ అనే వ్యక్తి, బాలిక తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో బాలికను తల్లిదండ్రులు మందలించడంతోపాటు, కాలనీలోనూ ఈ విషయం తెలిసింది. దీంతో కాలనీ వారు ఏమనుకుంటున్నారో అనే మనస్థాపంతో బాలిక తన ఇంట్లో శుక్రవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కడుపునొప్పి భరించలేక ఒకరు..



గజానంద్ (ఫైల్)

ఖలీల్‌వాడి: నగరానికి చెందిన ఓ వ్యక్తి కడుపు నొప్పి భరించలేక రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని దుబ్బ కాలనీకి చెందిన మెంగార్తి గజానంద్(47) వారం రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఈక్రమంలో గురువారం ఆస్పత్రికి వెళ్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. అనంతరం జాన్కంపేట్, నిజామాబాద్ రైల్వేస్టేషన్ మధ్యలో రైలుపట్టాలపైకి వెళ్లి ఎదురుగా వస్తున్న రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఉదయం శ్రద్ధానంద్ గంజ్‌లో తనిఖీలు నిర్వహించగా.. పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 1580 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మూడోటౌన్ పరిధిలో ఎవరైన పేకాట ఆడితే 8712659839కు లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

ఇరువురిపై కేసు నమోదు

నవీపేట: మండల కేంద్రంలో రెండు రోజుల కిందట జరిగిన పరస్పర దాడులలో ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలో మొరం దందా నిర్వహిస్తున్న వ్యాపారులు శేఖర్, సాయిలు మధ్య గత కొన్ని రోజులుగా లావాదేవీల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో రెండు రోజుల కిందట పరస్పర వాగ్వాదం, దాడులకు పాల్పడ్డారు. దీంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా.. సాయిలు, శేఖర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు

సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ట, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళపై లైంగిక వేధిపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్‌సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకుచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌చైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? అల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..



అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. –భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సయ్యద్ డానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యూల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.



నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా

నగర మాడ్యూల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

ఈ కేసులో సాక్షులుగా 'వారు'

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్–2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది, ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాదిరాన సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

నిర్వహించనున్న క్రీడలు.. : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

నగదు ప్రోత్సాహకాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ–రూ.20 వేలు, ద్వితీయ–రూ.15 వేలు, తృతీయ–రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొండికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టచెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

అలంకారప్రాయంగా రైతు వేదికలు



నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్ రైతువేదిక భవనం

- జిల్లా వ్యాప్తంగా 106 చోట్ల నిర్మాణం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

నందిపేట్(ఆర్మూర్): వ్యవసాయానికి సంబంధించి పథకాలతో పాటు సాగుపై అన్నదాతలకు మరింత అవగాహన కల్పించడం, రైతులంతా ఒకేచోట సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ఆలోచన ఎంతో ఘనంగా ఉన్నా ఆచరణలో మాత్రం శూన్యంగా కనిపిస్తుంది. నిర్మించిన రైతువేదికలు అలంకార ప్రాయంగా మిగిలిపోతున్నాయి. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టరు చొప్పున ఏర్పాటు చేసి ఇందుకు అనుగుణంగా రైతువేదికలను నిర్మించింది. జిల్లాలో 106 రైతువేదికలను నిర్మించారు. ప్రతి రైతువేదికకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.12 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు కేటాయించింది. కొన్ని రైతు వేదికల్లో సమావేశాలు జరుగుతున్నా చాలాచోట్ల గ్రామానికి దూరంగా నిర్మించడం, నిర్వహణ ఖర్చులు సరిగా రాకపోవడంతో రైతులు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. ప్రతి వారంలో రెండు రోజులు రైతులతో సమావేశాలు నిర్వహించాలి. ఈ సమావేశంలో శాస్త్రవేత్తల సలహాలు, సాగు పద్ధతిలో మెలకువలు, పలు పంటలకు ఆశించే తెగుళ్ల బారిన పడకుండా చర్యలు తీసుకోవడం గురించి వివరించాలి. అలాగే ప్రభుత్వం అందించే పథకాల గురించి వ్యవసాయాధికారులు వివరించాలి. కాగా అసలు సమావేశాలు జరగనపుడు వీటి గురించి వివరించే వారు లేరు. నామమాత్రంగా రైతులు ఎక్కడ దొరికితే అక్కడ ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టి సమావేశాలు నిర్వహిస్తూ అధికారులు కాలం వెల్లదీస్తున్నారు. కానీ రైతు వేదికలకు రైతులు మాత్రం రావడం లేదు.

నిర్వహణ ఖర్చులు రాక నిర్వీర్యం

రైతు వేదికల నిర్వహణ ఖర్చుల కింద ప్రతినెల రూ. 9 వేలు ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతుంది. 2020–2021 నుంచి రైతువేదికలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి కేవలం 5 నెలలకు సంబంధించి నిర్వహణ ఖర్చులు విడుదల అయ్యాయి. రూ.45 వేలు మంజూరు చేసి ఈ డబ్బును వ్యవసాయ విస్తరణ అధికారుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. ప్రతినెల కరెంట్ బిల్లు రూ.1000, స్వీపర్ వేతనం రూ.3 వేలు, తాగునీటి అవసరాలకు రూ.500, స్టేషనరీకి రూ.1000, సమావేశాల నిర్వహణకు రూ.2500, ఇతర ఖర్చులకు రూ.1000 ఖర్చు చేయాల్సి ఉంది. కాగా ప్రభుత్వం మంజూరు చేసిన నిర్వహణ ఖర్చులలో కరెంట్ బిల్లు, స్వీపర్ ఖర్చు ఖచ్చితంగా చెల్లించాలి. మిగతా వాటి గురించి మండల వ్యవసాయాధికారులకే తెలియాల్సి ఉంది. మండల వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి క్షేత్ర పరిశీలన చేయడం రైతులకు సూచనలు ఇవ్వడం జరుగుతుంది కానీ ఈ వేదికలు వాడుకున్న పాపాన పోలేదు.

ఎరువులు, విత్తనాలు ఎక్కడా?

రైతు వేదికల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. కానీ అందించిన దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. ఊరికి దూరంగా ఉండడంతో పాటు సిబ్బంది కొరత కారణంగా ఎరువులు అమ్మాలంటే అధికారులు భయపడుతున్నారు. దీంతో చాలామంది రైతులు వివిధ గ్రామాల్లో ఉన్న సహకార సంఘాల గోదాములలో, ప్రైవేటు వ్యాపారుల నుంచి ఎరువులు తెచ్చుకుంటున్నారు. ఎంతో ఆర్భాటంగా రైతువేదికలను నిర్మించి రైతులు సేవలందించాలనుకున్న ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు. రైతువేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే ఇవి గోదాములు మారి నిరుపయోగంగా తయారవుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వాడుకలో లేకుంటే తీవ్ర చర్యలు

రైతువేదికలు వాడుకలో ఉంచాలని వ్యవసాయాధికారులకు సూచిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏఈవోలు ప్రతిరోజు రైతు వేదికలకు వెళ్లి కార్యక్రమాలు నిర్వహించాలనే ఉత్తర్వులు ఇచ్చాం. ఎవరైన ఉత్తర్వులు ఉల్లంఘించినట్లయితే తీవ్ర చర్యలు తీసుకుంటాం.

– తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అంతరిస్తున్న పశు సంపద

- జిల్లాలో తగ్గుతున్న ఆవులు, గేదెల సంఖ్య
- పోషించలేక అమ్ముకుంటున్న పాడి రైతులు
- పశుగ్రాసం లేకపోవడం కూడా కారణమే!
- తగ్గుతున్న పాల దిగుబడి
- పశువుల కొనుగోలుకు రైతులను ప్రోత్సహించని ప్రభుత్వం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఒకప్పుడు పల్లెల్లో ప్రతి రైతుకు ఆవులు, గేదెలు ఉండేవి. పశువుల కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి కొట్టాలు ఏర్పాటు చేసేవారు. ఎక్కడ చూసినా పదికి తగ్గకుండా పశువులు కనిపించేవి. కానీ, ప్రస్తుతం గతానికి భిన్నంగా పరిస్థితులు మారిపోయాయి. పాడి రైతులు శ్రమించలేక, గేదెలను పోషించలేక వాటిని అమ్ముకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో నూటికి యాభై శాతం మంది రైతులు పశుపోషణకు స్వస్తి చెప్పారు. దీంతో జిల్లాలో పశు సంపద నానాటికి తగ్గుతూ వస్తోంది. గేదెలు తక్కువ సంఖ్యలో కనిపిస్తుండగా, ఆవులైతే ఎక్కడో ఒక చోట దర్శనమిస్తున్నాయి. 2012లో చేసిన పశుగణన వివరాలను 2019 సంవత్సరంతో పోల్చి చూస్తే ఆవులు, ఎడ్లు కలిపి 25,759 తగ్గాయి. అదే విధంగా గేదెల సంఖ్య కూడా 11,308 తగ్గింది. అయితే, 2020 నుంచి ప్రస్తుత ఏడాది వరకు పశు లెక్కలను తీస్తే మరిన్ని తగ్గే అవకాశముంది. తద్వారా జిల్లాలో పాల దిగుబడిపై కూడా స్పష్టమైన ప్రభావం కనిపిస్తోంది. స్థానికంగానే విడిగా లభించే పాలు, ఇతర ప్రాంతాల నుంచి ప్యాకెట్ల రూపంలో దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



శ్రమించే రైతులు తగ్గిపోయారు..

పశుపోషణతో పాటు వాటి సంపదను పెంచడానికి పాడి రైతులు శ్రమించడం లేదు. పశువులిచ్చే పాలను చూస్తున్నారే కానీ వాటికి ఆహారం అందించడానికి కష్టపడడం లేదు. స్వయంగా పాడి పశువులను స్వయంగా చూసుకోవడం భారంగా భావించిన చాలామంది రైతులు కూలీలను పెట్టుకుంటున్నారు. కూలీలు కూడా చేతులెత్తేస్తే గేదెలను పోషించలేక వాటిని అమ్మేస్తున్నారు. కాగా గతంలో మాదిరిగా మేత వనరులు కూడా బయట లభించడం లేదు. కృత్రిమంగా దొరికే పచ్చిగడ్డి కొరత ఏర్పడింది. అలాగే రైతులు సాగుచేసే పొలంలో పశువుల కోసం ఐదు శాతం భూమిలో పచ్చిగడ్డి మేతను పెంచేవారు. ప్రస్తుతం అలా చేయడం లేదు. ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందజేస్తున్నా కూడా రైతులు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. జిల్లాలో పాడి రైతుల సంఖ్య కేవలం వేలల్లోనే ఉంది. ప్రైవేటు డెయిరీలకు, వ్యాపారులకు పాలను అమ్మే రైతులు పోను, విజయ డెయిరీకి పాలను విక్రయించేవారి సంఖ్య 4వేల పైచిలుకు ఉంది. వీరి ద్వారా రోజుకు 5వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది.

సంవత్సరం	ఆవులు, ఎడ్లు	గేదెలు
2012	1,27,011	2,18,206
2019	1,01,252	2,06,898


2020 నుంచి ప్రస్తుతం ఏడాది వరకు పశువుల సంఖ్య దీనికంటే మరింత తక్కువగా ఉండొచ్చు.

గొర్రెలకిస్తున్న సబ్సిడీ గేదెలకిస్తే..



జిల్లాలో పాలిచ్చే పశువుల సంఖ్య క్రమేపీ తగ్గడంతో ప్రజలకు సరిపడా పాలు లభించడం లేదు. ఈ విషయం అధికారులకు, ప్రభుత్వానికి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నా గేదెల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టడం లేదు. గొర్రెల కొనుగోలుకు సబ్సిడీ ఇచ్చి గొల్ల, కుర్మలను ప్రోత్సహించడంతో వాటి సంఖ్య గణనీయంగా పెరిగింది. గేదెల కొనుగోలుకు కూడా ఇదే విధంగా సబ్సిడీ ఇచ్చి చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించి మేలుజాతి గడ్డివిత్తనాలు కూడా సరఫరా చేస్తే పశు సంపద పెరగడానికి అవకాశముంది. తద్వారా రైతులు ఆర్థికంగా బలపడడంతో పాటు పాల ఉత్పత్తి పెరగడానికి అవకాశముంటుంది. ప్రభుత్వం ప్రత్యేకంగా రుణాలను అందజేయాలని పలువురు కోరుతున్నారు. ఇందుకు బ్యాంకర్లు కూడా సహకారం అందించాలి.

పశుసంపదను పెంచడం యువరైతులతోనే సాధ్యం



జిల్లాలో పశు సంపదను పెంచాలంటే ఆసక్తి గల గ్రామీణ యువ రైతులు ముందుకు రావాల్సిన అవసరం చాలా ఉంది. పశు పోషణలో మెలకువలు నేర్చుకుని డెయిరీ రంగంలో రాణిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకోవాలి. రుణాలు పొంది డెయిరీని స్థాపించాలి. ప్రభుత్వం ద్వారా సహకారంతో పాటు గడ్డి విత్తనాలను సబ్సిడీపై అందిస్తోంది. వి జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, నిజామాబాద్

తగ్గుతున్న నువ్వుల ధర

- పంట చేతికి రాకముందు ఊరించిన ధర
- విక్రయించే సమయంలో పడిపోతున్న రేటు
- ఆందోళన చెందుతున్న రైతులు

మోర్తాడ్: కోతలకు ముందు నువ్వులకు ఊరించిన ధర పంట చేతికి వచ్చిన సమయంలో తగ్గిపోయి రైతుల ముఖంలో నవ్వులను మాయం చేసింది. నువ్వులకు రికార్డు స్థాయిలో క్వింటాలుకు రూ.19,000 వరకు పలికిన ధర.. ఇప్పుడు రూ.13,500కు పడిపోయింది. విదేశాల నుంచి మన దేశానికి నువ్వుల దిగుమతి తగ్గిపోవడంతో ఇక్కడ పండించిన పంటలకు విపరీతంగా డిమాండ్ ఏర్పడింది. ఒకేసారి ఎగబాకిన ధర నువ్వుల పంట చేతికి వచ్చిన సమయంలో దిగిపోయి లాభాలు తగ్గిపోతున్నాయి. యాసంగి సీజనుకుగాను జిల్లాలో సుమారు నాలుగ వేల ఎకరాల్లో నువ్వు సాగు చేశారు. గత సంవత్సరంలోను నువ్వులకు ధర బాగా ఉండటంతో రైతులు ఈ సీజనులో అదే ఆశతో పంట సాగు చేశారు. అకాల వర్షాలతో 50 శాతం పంట దెబ్బతింది. ఉన్న పంటకైనా మంచి ధర లభిస్తే ఎంతో ప్రయోజనం అని రైతులు ఆశించారు.



మోర్తాడ్‌లో సాగు చేసిన నువ్వు పంట

వారం రోజుల నుంచి వాతావరణం అనుకూలించడంతో రైతులు పంటను కోయడం, నువ్వులను ఆరబెట్టడం చేస్తున్నారు. మార్కెట్‌లో నువ్వుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఈ సమయంలో రోజుకు రూ.500 చొప్పున ధర పడిపోతుండటం గమనార్హం. వ్యాపారులు సిండికేట్ కావడంతోనే ధర తగ్గిపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాలతో నువ్వుల దిగుబడిపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. ఇలాంటి సమయంలో ఉన్న పంటకు మరింత ధర పెరగాల్సి ఉన్నా భిన్నమైన పరిస్థితి నెలకొనడంతో రైతులకు మింగుడుపడటం లేదు.

వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు



నువ్వులకు మొన్నటి వరకు మంచి ధర లభించింది. ఎంతో ఆశతో ఉన్న మాకు ధర పడిపోయి నిరాశనే మిగిలింది. వ్యాపారులు సిండికేట్ కావడంతోనే నువ్వుల ధర తగ్గిపోతుంది.

– రొక్కం మురళి, రైతు, తిమ్మాపూర్

ప్రజల్లో బీజేపీ అనైక్యతను సృష్టించాలనుకుంటోంది



ఖలీల్‌వాడి: బీజేపీ ప్రభుత్వం ప్రజలలో అనైక్యతను సృష్టించి మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టి తమ రాజకీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్ ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎంపీ బ్రిజ్ భూషణ్‌పైన లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు వస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తున్నారని అన్నారు. పాలడుగు భాస్కర్, రమేశ్ బాబు, వెంకట్రాములు, నూర్జహాన్ పాల్గొన్నారు.